# ఒక్కమాట!

మాదిరెడ్డి సులోచన



"క్రాంతీ .... క్రాంతీ ! నీకీ విషయం తెలుసా ?" హడావుడిగా వచ్చింది లలిత.

"ఏ విషయం ?" పేపర్ ప్రక్కన పడేసి ఆసక్తిగా అడిగాను.

"తారా, శ్రీధర్ విడిపోయారట." అన్నది.

ఏప్రిల్ ఫస్ట్ కాదు కదా అని కేలెండర్ వంక చూచాను. ఆ రోజు మార్చి ఇరవైరెండు !

"నీకు నమ్మకం కలగటం లేదు కదూ ! ఆనోట, ఈనోట విని నమ్మక ఇంటికి వెళ్ళాను. శ్రీధర్ ఒక్కడే ఉన్నాడు. తార అన్న ఇంటికి వెళ్ళాను. అక్కడ నేను ఊహించినట్టే తార ఉంది. నేను అడక్కముందే తనూ, శ్రీధర్ విడిపోయినట్టు చెప్పింది."

"ఎందుకో అడుగలేదా ?"

"ఆమె మాటలకు, నిబ్బరానికి, పొగరుకు హైరానా పడిపోయి అసలు సంగతి అడగనేలేదు" అన్నది లలిత. ఎవరెవరు చెప్పారో, ఏ ఆధారాలతో చెప్పారో చెబుతుంటే వింటున్నా. నా మనసు పరిపరి విధాలుగా పోతూంది.

శ్రీధర్, నేను, తారా, లలిత ఎమ్మెస్సీ ఒకేసారి చేశాము. తార చలాకి అయిన యువతి. అందం, దానికి తగిన చాతుర్యంతో మనుషుల్ని నిముషములో ఆకట్టుకుంటుంది. పరిచయస్తులుగా ఉన్న శ్రీధర్, తార ఎమ్మెస్సీ ఫైనల్‌లో ప్రేమికులయ్యారు. పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ అందరికీ తెలుసు. ఒకరి కోసం ఒకరు పడే ఆరాటం, ఒకరిపట్ల ఒకరికున్న ఆరాధన, ఒకరిపై ఒకరు పెంచు

కున్న అనురాగం నాకూ బాగా తెలుసు. వాళ్ళ కబుర్లన్నీ ఏ రోజుకారోజు నాకు చెబితే గాని తోచేది కాదు తారకు.

ఎమ్మెస్సీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పరీక్ష ముందు గంభీరంగా ఉండ వలసిన వాతావరణం నవ్వుల జల్లుకురిసినట్టుంది. మా క్లాస్‌మేట్స్ అంతా పకపక నవ్వుతున్నారు. తెల్ల చీరలో సిగ్గుల మొగ్గలా నిల్చుంది తార.

"ఏమిటబ్రా?" అన్నాను కుతూహలంగా. నేను అప్పటికే వివాహితురాలిని కావటం మూలాన అందరూ గౌరవంగా చూస్తారు. పెద్ద రికం అంటగడతారు.

"రా క్రాంతీ! మన తార, శ్రీధర్‌లు ఈ రోజే జంటగా కూర్చుంటున్నారు. కూడబలు క్కుని తెల్ల దుస్తులలో వచ్చారు చూడు." నంద కుమార్ చెప్పాడు. చుట్టూ చూచాడు. కొద్ది దూరంలో శ్రీధర్ నిలబడ్డాడు. అతని ముఖం ఎర్రగా ఉంది. అప్రయత్నంగా మా చూపులు కలుసుకున్నాయి.

"చూడు క్రాంతీ! కాకతాళీయంగా మా నంబర్లు ప్రక్క ప్రక్కన పడితే...." ఆరోపణగా అన్నాడు శ్రీధర్.

"ఓయ్....కొయ్యకు కోతలు. తెల్లబట్టలు కూడా కాకతాళీయంగా ధరించారా?" లలిత అడిగింది. లలితకు అసలే వాళ్ళంటే కోపం. శ్రీధర్‌ను తను అభిమానించింది. అతను రెస్పాన్స్ ఇవ్వలేదు. లలితను మొదటి పరిచ యంలో అయితే ఇష్టే అభిమానిస్తాం. మాటల నిండా మధువే కురిపిస్తుంది. ఆ చనువు. ఆప్యా యత చూస్తే మతి పోతుంది. కాస్త నిదానించి, లలితను గమనిస్తే ఆమె మాటల్లో డెభ్భైఐదు శాతం అబద్ధం, ఇరవై ఐదు శాతం వప్పు అని తేలుతుంది. లాబ్‌లో రౌండ్ బాటమ్ ఫ్లాస్క్ చూడగానే లలిత గుర్తుకు వస్తుంది నాకు. నందకుమార్, రహీమ్ వాళ్ళంతా కాలక్షేప బఠాని అంటారు. కబుర్లు ఊరించి, మసాలా రంగరించి కలిపి మరీ చెబుతుంది. లలితకు తారంటే ఓ విధమైన ఈర్ష్య. కాని బయట పడదు. అందుకే శ్రీధర్‌ని నిలదీసింది.

"బిలీవ్ మి—అసలు అనుకోలేదు." శ్రీధర్ సంజాయిషీ. "మీరు కావాలనుకుని కట్టుకున్నారో అలా కలిసి వచ్చిందో మాకు తెలియదు. సాయంత్రం ఇద్దరూ కలిసి పార్టీ ఇవ్వాలి." అందరూ పట్టు పట్టి పార్టీకి ఒప్పించారు. ప్రొఫె సర్ రావటంతో అందరం కూర్చున్నాము. ఆయన కూడా వాళ్ళిద్దరిని చూచి—ముసి ముసిగా నవ్వాడు. అదో ప్రత్యేక ఘటనగా మేం గుర్తించు కున్నాం. దానికి వికారమైన రంగులు పూసి లలిత ప్రచారం చేసింది. ఆ నాడు అతనలా ప్రక్కన ఉండటంతో సరిగ్గా రాయలేక ఫస్ట్ క్లాసు మిస్ చేశానంటుంది తార. ఏమయితేనేం, ఆ తరువాత ఇద్దరూ వివాహం చేసుకున్నారు. అతను రీజినల్ రిసర్చి లాబొరేటరీలో ఉద్యోగం చేస్తు న్నాడు. ఆమె కాలేజిలో లెక్చరరుగా పనిచేస్తూంది. చీకు, చింతా లేనట్టు స్కూటర్‌పై తిరిగే ఆ జంటను నేను యెరుగుదును. ఒకొక్కసారి తార దూకుడుగా ప్రవర్తించినా శ్రీధర్ సర్దుకు పోయేవాడు.

"నేను చెప్పింది వినిపించిందా?" లలిత రెట్టించింది.

"ఆఁ....విఁటున్నాను. మన సమస్యలే మన కున్నాయి. ఇతరుల గురించి యెందుకు? కొత్త పుస్తకాలేం చదివావు?" మాట మార్చాను. 'స్నేహితురాలి పట్ల ఉన్న అభిమానమింతేనా' అన్నట్టు, ఒక ఆశ్చర్యకరమైన భావం కనప డిందా కళ్ళల్లో. లలిత లాంటి వారితో చాలా ప్రమాదం. మా ట్లా డి న ప్పు డ ల్లా మనం ఊకొడితే మనమే మాట్లాడామనే చమత్కారి. పూర్తిగా ఉద్యోగ విషయాలు మాట్లాడుతూంటే నిరుత్సాహంగా లేచిపోయింది లలిత. వెడుతూ అసలు విషయం చెప్పింది. "అయినా తార కిదేం బుద్ధి! ఓ బిడ్డ తల్లి కూడాను. ఫలానా.... గొప్పవాడిని ఉంచుకుందట." అన్నది. నాకు ఆశ్చర్యం కలుగలేదు. నవ్వు వచ్చింది. పక్కున నవ్వేశాను.

"నా మాటలు నవ్వులాటగా ఉన్నాయా?

"అబ్బే.....అదికాదు. తార కేస్‌కి నవ్వు వస్తూంది." అన్నాను. లలిత వెళ్ళిపోయింది. పిల్లలు ఆటల నుండి రావటంతో ఆ విషయం మరిచిపోయాను. రాత్రి పడుకునేటప్పుడు మావారు కూడా అదే విషయం చెప్పారు. నమ్మక తప్పలేదు. మర్నాడు కాలేజి నుండి వస్తూ తార దగ్గరకు వెళ్ళాను.

"ఓర్ఫ్! క్రాంతీ, నేనొక గొప్పవాడిని ఉంచు కున్నాను. మా ఆయన్ని వదిలేశాను." అన్నది నవ్వుతూ. కళ్ళు వర్షిస్తున్నాయి. పిచ్చిపట్టిందా అనిపించింది. ఆ తరువాత ఏడ్చి మనసు తేలిక పరుచుకుంది.

"ఇదమ్మా వరస. పనికిమాలినవారు అనుకుం టున్నారని ఈవిడ ఇలా బాధ పడుతూంది." వాళ్ళ వదిన నిష్ఠూరంగా అన్నది. అన్న పిల్లలు చుట్టూ చేరి తమాషా చూస్తున్నారు. అలా వెళ్దామని తనను లేవదీశాను. ఇద్దరం దగ్గరలో ఉన్న పార్కుకు వెళ్ళాం. అసలు సంగతేమిటని అడిగాను.

"ఆ మధ్య ఢిల్లీ కాన్ఫరెన్స్‌కి వెళ్ళాం గుర్తుందా?" తార అడిగింది.

"అవును. మాకూ ఆహ్వానం వచ్చింది. మేం రాలేదు."

"పింకి-చిన్న పిల్ల-నేను వెళ్ళనన్నాను. ఆదర్శ పురుషుడు నా మొగుడు-వెళ్ళూ, వెళ్ళూ, నలుగు రినీ చూడు అంటూ పోరాడు. ఆఖరి క్షణంలో అన్నయ్య కూడా బలవంతం చేసి పింకిని ఉంచు కుంటానంటే బయలుదేరాను. మనమేమి లక్షాధి కార్లమా అని ఆయన ప్లేన్‌లో వెళ్ళమంటే రిజర్వేషన్ లేకుండా బండిలోనే బయలుదేరాను. టి.సి. లతో చెప్పి ఏదో ఒక ఏర్పాటు చేసుకుందా మని. ఒక రాత్రి గడిచింది. టి. సి నేను అడిగిన విషయం పట్టించుకోనేలేదు. ఓ స్టేషన్లో ఘర్షణ పడుతుండగా, మా నాన్నగారి చిన్ననాటి స్నేహి తులు, పలుకుబడి గల వ్యక్తి, కలుగజేసుకుని అసలు విషయం కనుక్కుని, తన కంపార్ట్‌మెంటు లోకి మార్పించారు. నేను మొహమాటంలో వద్దన బోయినా ఆయన వినిపించుకోలేదు.

"అదేంటమ్మాయ్! మీనాన్న పిలిస్తే వెళ్ళవా? నాకూ తోచటం లేదు." అన్నారు. ఆయనను చూచి టి. సి. కుక్కిన పేనులా నమస్కరించాడు.

"ఫస్ట్‌క్లాసులో అయినా రెండు రోజుల ప్రయాణం బోరుకొడుతుంది. ఆరోగ్య రీత్యా విమానం యెక్కకూడదు...." ఆయన ఆయాస పడిపోయారు. ఆయన గుమస్తా మందులిస్తూ వెంటే ఉన్నాడు. ముగ్గురం పేకాడుతూ, ఢిల్లీ వెళ్ళాం. దిగి హాయిగా వెళ్ళిపోకూడదూ? లలితతో పాటు దిగిన మరో ఇద్దరిని ఆయనకు పరిచయం చేసి నా కొచ్చిన సమస్య, ఆయన విడదీసిన చిక్కు-అన్నీ చెప్పాను. మా అందరినీ ఆయన సరదాగా ఓ పూట భోజనానికి పిలిచాడు. లలిత అతని ఔదార్యాన్ని పొగిడింది. ఇంద్రుడు, చంద్రుడు అన్నది. ఆయన కార్లో ఊరు చూడాలనే కోరిక వ్యక్తం చేసింది. తిరిగాం. ఇక్కడికి వచ్చి నాకు

అతడికి సంబంధమని, ఒకటేమిటి....నోరు రావటం లేదు.'' మరోసారి భోరుమంది. నాకు జాలేసింది.

'' ఆ నీలివార్తలు, గాలి కబుర్లు శ్రీధర్ ఎలా నమ్మాడు ?'' జవాబు చెప్పక ముఖం తిప్పుకుంది తార. చీకటిపడింది. నేను ఎన్నిరకాలుగా అడిగినా ఒకటేమాట.

'' నా దురదృష్టం....పోనివ్వు.'' అంటుంది. ఇద్దరం ఇంటికి వచ్చాము. హాల్లో కూతుర్ని ఎత్తుకుని, తార వదినతో మాట్లాడుతున్నాడు శ్రీధర్. తార ముఖం తిప్పుకుని లోపలికి వెళ్ళింది. కాసేపు లోకాభిరామాయణం, కాఫీలు అయ్యాయి. మేం బయటి నుండి రావటం చూచి విషయం గ్రహించినట్టున్నాడు శ్రీధర్.

'' ఏం చెప్పింది మీ స్నేహితురాలు ?'' అన్నాడు.

'' తార నాకేం చెప్పలేదు కాని. లలిత విషయం తెలిసిన మీరే ఇలా అనుమానిస్తే...."

'' నేను అనుమానించి వెళ్ళగొట్టానని చెప్పిందా?'' రోషంగా మధ్యలోనే అందుకున్నాడు.

'' అందరూ అనుకుంటున్నారట, మీరు విడిపోయారని....''

'' ఈ ఇడియెట్ తొందరపాటు వల్ల అనుకుంటున్నారు. నలుగురు నాలుగు మాటలు అనుకుని గుసగుసలాడుతుంటే 'కాస్త జాగ్రత్తగా ఉండకూడదూ ? ఈ రూమర్స్ వింటూ నిగ్రహించుకోవటం ఎంత నరకమో' అన్నాను. ఆ మాత్రం అనకూడదా? నేనూ మనిషినే. చికాకులుండవా?''

'' ఆ మాత్రం అంటే పరుగెత్తుకొచ్చే మూర్ఖురాలిని కానని క్రాంతికి బాగా తెలుసు.'' తుఫానులా వచ్చింది తార, ఊపిరి వేగంగా తీస్తూ.

''ఏమో యెవరికి తెలుసు. అతనితో తిరిగావేమో అంటాడా ! నా తండ్రికంటే పెద్దవారు. పూజ్యులు, ఆయనతో తిరుగుతానట. ఈయన అనుమానం....'' రోషంతో ఏదో గొంతుకు అడ్డం పడింది. అందరూ అంటే అంతగా బాధపడరు గాని, అందరితోనూ ఆత్మీయులూ చేరితే !

'' తారా ! సెన్స్‌లెస్‌గా మాట్లాడకు....చూడు క్రాంతీ, మీ స్నేహితురాలి కోపం ! 'అందరూ అన్నవి మీరు నమ్ముతున్నారా....మీరు నమ్ముతున్నారా?' అంటూ పదిసార్లు రెట్టించింది. అసలే చికాకుగా ఉన్నాను. కొందరు విషపూరితమైన నవ్వు నవ్వుతూ, 'ఏమోయ్ శ్రీకాంత్ ! ఫలానా 'పలుకుబడిదారు' మీ ఆవిడకు క్లోజట. కాస్త నా పని....' అంటూ మొదలు పెట్టారు. ఇలాంటివే విని, విని విసుగెత్తి ఇంటికి రాగానే కాస్త చికాకుపడిన మాట వాస్తవమే..''


"నన్ను అనుమానించిన ఈ ఇంట్లో నేనుండను." తార అన్నది.

'' పోనీ ఇల్లు మారుద్దాం.'' వాతావరణం తేలిక చెయ్యాలని అన్నాడు శ్రీధర్.

'' చాల్లెండి హాస్యం. మీ మెరమెప్పులకు పొంగిపోను. నాకు మండిపోతూంది.''

'' చూడు క్రాంతీ ! తను ఎన్నిసార్లు నన్ను అనుమానించిదో అడుగు...'' ఇంకా ఏదో చెప్పబోయాడు.

'' చాల్లెండి ప్రతాపం ! బయట తాళం వేస్తారు. కిటికీలు పెద్ద, పెద్దవి. దొంగ దూరినా



గుడ్లను పగలగొట్టాక వాటిపై పెంకులను పారెయ్యకుండా దాంతో ఉపయోగించిన టీ పొడిని కలిపి ఎండబెట్టి, గులాబీ మొక్కలకు ఎరువుగా వాడితే–పెద్ద పువ్వులు పూస్తాయి.

దిక్కులేదు. వెళ్ళండి.'' అన్నది కసురుకుంటూ.

'' నువ్వురా....'' అన్నాడు.

'' వెళ్ళు తారా ! తెలిసిన సంగతేగా ! లలిత మాటలు పట్టించుకుంటావా !'' అన్నాను.

తార వదిన నేను భోజనం చేసేవరకు వదలలేదు.

'' నిన్ను వదిలివస్తాను రా క్రాంతీ '' శ్రీధర్ స్కూటర్ తీశాడు.

'' మీ ఆవిడకు అనుమానాలని ఇప్పుడే చెప్పావు. వద్దులే బాబూ.''

'' ఏయ్ ! ఏమిటే వాగావు ?'' తార కోపంగా చూచింది.

'' నేను రిక్షలో వెళ్ళగలను గాని, మీరు వెళ్ళండి. విష్ యూ హాప్పీ నైట్.'' అన్నాను.

''థాంక్స్.'' చిన్నగా నవ్వాడు శ్రీధర్. కొరకొర చూచింది తార. వాళ్ళ స్కూటర్ వెళ్ళిపోయాక తేలికగా నిట్టూర్చాను. తార అన్నకు, వదినకు చెప్పి ఇంటికి వచ్చేశాను. జీవితంలో ఇలాంటి అవమానాలు, అనుమానాలు అందరికీ తప్పవేమో అని నేను, మావారు అనుకున్నాము.

నెల రోజుల తరువాత, ఈ అనుమానం తేలికగా తుడిచి పెట్టుకు పోలేదని అర్థం అయింది. లలిత, తార ఒకే కాలేజిలో పని చేస్తారు. అక్కడి విసుర్లు, గుసగుసలు భరించలేక పోయింది తార. అందరూ వింత వ్యక్తిని చేసి చూడటం, 'కాలేజి కాలం నాటి నుంచి గ్రంథసాంగురాలేనట. పరీక్ష రోజే ప్రణయం పాకాన పడిందట.' తార విషయం విద్యార్థుల వరకు వెళ్ళిందట. అది భరించలేక రిజైన్ చేసింది. మరో నెల తరువాత శ్రీధర్ వచ్చి తనకు తిరుపతి కాలేజిలో లెక్చరర్ ఉద్యోగం వచ్చింది–వెడతానన్నాడు.

'' ఆదేం ! బంగారంలాంటి సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగం !'' మేమిద్దరం ఆశ్చర్యపోయాము.

'' క్రాంతీ ! స్త్రీలకే సమస్యలని మీరు అనుకుంటున్నారు. ఆఫీసుల్లో క్లబ్బుల్లో నా విషయంలో జరిగే ప్రచారాలు వింటుంటే....'' అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

'' మూర్ఖుల మాటలకు అంత ప్రాముఖ్యం ఇస్తావా ?''

''మూర్ఖులు..రోజూ ముఖాలు చూచే మనుషులు. నేనూ మనిషినే. ఏదో ఒక రోజు ఆవేశంలో ఎవరినో ఒకరిని హత్య చేసినా ఆశ్చర్యపోవద్దు. అందుకే....అందుకే ఈ పరిసరాలకు దూరంగా వెళ్ళిపోతున్నాం.'' అతని మాటల్లోని ఆవేదన వర్ణించలేను.

'' అక్కడ మాత్రం ఇలాంటివి ఉండవా ?''

'' స్నేహాలకు, పరిచయాలకు స్వస్తి చెబుతాను.'' అన్నాడు. ఒక్క మాట యెంత అనర్థాలను సృష్టించగలదో అర్థం అయింది. లలితలాంటి స్త్రీలే స్త్రీలకు శత్రువులు. హత్యలు కత్తులు పట్టుకు చెయ్యక్కరలేదు. ఇది హత్యకంటే ఘోరమయింది. నిజమే. మనిషికి మనశ్శాంతి కావాలి. అది లేనినాడు ఎన్ని ఉన్నా వ్యర్థం. లలితలాంటి స్త్రీలను ఏమీ చెయ్యలేము. ఏ చట్టమూ శిక్షించలేదు. భారంగా శ్రీధర్‌ను సాగనంపాము.